సాక్షి
కాకినాడ
మంగళవారం । 14 । జనవరి । 2025



నిత్యాన్నదాన పథకానికి విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కొవ్వూరి గౌతమ్‌రెడ్డి, సూర్యలక్ష్మి దంపతులు (రావులపాలెం) రూ.1,00,107, బొడ్డిరెడ్డి ప్రదీప్‌కుమార్‌రెడ్డి (హన్మకొండ) రూ.లక్ష అందజేశారు.



రూ.1,00,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరి స్వామినాయుడు (వీరవాసరం) సోమవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 12,040 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 12,040 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,800 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

వీడిన దాంపత్య బంధం

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి
- భర్తకు తీవ్ర గాయాలు



బెండపూడిలో లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

తొండంగి: వారి పయనం అర్ధాంతరంగా ముగిసిపోయింది.. అనుకోని ప్రమాదం దాంపత్య బంధాన్ని విడదీసింది.. తొండంగి మండలం జాతీయ రహదారి బెండపూడి శివారు వై.జంక్షన్ వద్ద ఓ బైకును కారు ఢీకొన్న ఘటనలో భార్య మృతి చెందగా, భర్త తీవ్ర గాయాల పాలయ్యాడు. కరప మండలం వేలంగి గ్రామానికి చెందిన మార్సర్తి వీరబాబు, అతని భార్య లక్ష్మిలు తమ బైక్‌పై బంధువులను పరామర్శించేందుకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామానికి బయలు దేరారు. ఈ నేపథ్యంలో బెండపూడి ఆర్చి వద్దకు వచ్చేసరికి వీరి బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో లక్ష్మి (35) తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన వీరబాబును 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరికి కుమారుడు దుర్గాప్రసాద్, కుమార్తె ధనలక్ష్మి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా జాన్‌వెస్లీ



జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడిగా జగ్గంపేటకు చెందిన కుండా జాన్ వెస్లీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. జాన్ వెస్లీకి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

అదనపు ఎస్పీగా మనీష్ దేవరాజ్



కాకినాడ క్రైం: జిల్లా అదనపు ఎస్పీగా మనీష్ దేవరాజ్ పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సో మవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. తొలుత గ్రే హౌండ్స్‌లో పని చేసిన అనుభవం ఉంది.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

అంబాజీపేట: మోటారు సైకిళ్ల తప్పించే ప్రయత్నంలో రెండు సామాజిక వర్గాల మధ్య సోమవారం సాయంత్రం ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ముక్కామల జెడ్పీ హైస్కూల్ సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేలు, గుండాల బరికి కూతవేటు దూరంలో ప్రధాన రహదారిపై ఇరువర్గాలకు చెందిన యువకులు మోటారు సైకిళ్ల తప్పించే ప్రయత్నంలో వివాదం జరిగింది. ఇది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ విషయమై స్థానికులు అంబాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని అక్కడ ఉన్నవారిని చెదరగొట్టారు. అలాగే కోడి పందేలు, గుండాలను నిలుపుదల చేయించారు. క్షతగాత్రులు అమలాపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. ఇదిలా ఉండగా ఘర్షణ సమయంలో పోలీస్ కానిస్టేబుల్ నియంత్రిస్తుండగా, అతనిపైనా యువకులు కేకలు వేసినట్లు స్థానికులు తెలిపారు.

కొక్కొరొకో.. కోఢీ

- కూటమి నేతల బరితెగింపు
- యథేచ్ఛగా కోడిపందేలు
- విచ్చలవిడిగా గుండాటలు.. జూదాలు
- ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఒప్పందాలు
- రూ.లక్షలు పలికిన గుండాట బోర్డులు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంక్రాంతి పండగ సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని.. కోడి పందేలకు, జూద క్రీడలకు దూరంగా ఉండాలని.. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ పోలీసు యంత్రాంగం కొన్ని రోజులుగా హెచ్చరిస్తూనే ఉంది. అయినప్పటికీ అఫ్ట్రాల్ అన్నట్టుగా ఆ హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయని పందేలరాయుళ్లు.. అధికార కూటమి నేతల అండతో.. తమకు అడ్డే లేదన్నట్టుగా 'బరి' తెగించేశారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బరుల్లో షరా మామూలుగానే పందెం కోడి కాలు దువ్వింది.. కత్తి కట్టించుకుని.. తగ్గేదేలే అన్నట్టుగా బరిలో తలపడింది. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బరులు ఏర్పాటయ్యాయి. మూడు రోజుల సంక్రాంతి పండగల్లో తొలి రోజయిన భోగి నాడే కోడి పందేలు, గుండాట, పేకాట, లాటరీ, జూదం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు విచ్చలవిడిగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో సోమవారం జరిగిన కోడిపందేలు, గుండాటల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మొదటి స్థానంలో నిలవగా కాకినాడ జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం సుమారు 350 బరుల్లో కోడి పందేలు జరిగాయని అంచనా. ఇందులో కోనసీమ జిల్లాలోనే అత్యధికంగా 110 బరుల్లో కోడి పందేలు జరిగాయి. ఈ ప్రాంతంలో తొలి రోజు రూ.110 కోట్లుపైనే పందేలు జరిగాయని లెక్కలేస్తున్నారు.

పత్తా లేని పోలీసులు

సంక్రాంతికి రెండు రోజులు ముందు పోలీసులు హడావుడి చేశారు. కోడిపందేలు, గుండాటలు ఆడితే కటకటాల్లో వేస్తామని హెచ్చరించారు. కొన్ని ప్రాంతాల్లోని ప్రైవేటు లే అవుట్లలో కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరులు, టెంట్లు వంటి వాటిని పీకేశారు. తీరా చూస్తే ఈ పండగల్లో మొదటిదైన భోగి నాడే ఎక్కడికక్కడే కోడిపందేలు, గుండాటలు బహిరంగంగానే మొదలైపోయాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు పత్తా లేకుండా పోయారు. కూటమి ప్రజాప్రతినిధుల ఆదేశాలు.. ఆయా పార్టీల నేతల కనుసన్నల్లో పందేలరాయుళ్లతో ముందస్తుగా కుదిరిన ఆర్థికపరమైన ఒప్పందాలు పోలీసులను కట్టడి చేశాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ సెట్టింగ్‌లు, ఇంటర్నేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌ను తలపించేలా గ్యాలరీలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లతో కోడి పందేలు నిర్వహించినా పోలీసు యంత్రాంగం మొత్తం చోద్యం చూస్తూ మిన్నకుండిపోయింది.

కూటమి నేతల అండదండలతో..

అధికార కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు, మాజీలు, ఆ పార్టీ నేతల సమక్షంలో పందేలరాయుళ్లు చేసుకున్న ఒప్పందాలు రూ.కోట్లలోనే ఉన్నాయని అంటున్నారు. సంక్రాంతి పండగ మూడు రోజులు కోడి పందేలకు అనుమతులున్నాయంటూ పందేలరాయుళ్లు బరి తెగించారు. కూటమి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల స్వీయ పర్యవేక్షణలోనే కోళ్లకు కత్తులు కట్టి మరీ పందేలు జరిపించారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచే కోడిపందేలు, గుండాటలు హోరెత్తాయి.



మురమళ్లలో జోరుగా గుండాటలు



మురమళ్ల బరిలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్

- కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు బోట్‌క్లబ్ పార్క్‌లో సంప్రదాయం పేరుతో కోడి పందేలు ప్రారంభించారు. కూటమి నేతల కనుసన్నల్లోనే కాకినాడ రూరల్, కరప మండలాల్లో విచ్చలవిడిగా పందేలు జరుగుతున్నాయి. కాకినాడ రూరల్ తిమ్మాపురం, సర్పవరం గ్రామాల్లో జరుగుతున్న పందేలు రూ.7 కోట్ల వరకూ ఉంటాయని అంచనా వేస్తున్నారు. కరపలో మూడు రోజుల పాటు నిర్వహించే 60 పందేల్లో ఎక్కువ గెలిచిన వారికి బహుమతిగా రూ.25 లక్షల విలువైన తార్‌జీపు.. గురజనాపల్లి, గొర్రిపూడి బరుల్లో 4 రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్లను బహుమతులుగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. మూడు రోజుల పందేల అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. టీడీపీ, జనసేన విడివిడిగా బరులు ఏర్పాటు చేయగా, తొలి రోజే రూ.కోటికి పైనే చేతులు మారినట్లు అంచనా. కరప మండలంలోని కొన్ని గ్రామాల్లో టీడీపీ, కొన్ని గ్రామాల్లో జనసేన కోడిపందేలు నిర్వహించుకునేలా ఒప్పందాలు చేసుకున్నాయి. ఒక్కో బరికి రూ.లక్ష వంతున పోలీసులకు ముట్టజెప్పారని అంటున్నారు.
- ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పందేలు జరుగుతున్నాయి. కోడిపందేలకు ప్రసిద్ధి చెందిన వేట్లపాలెంలో ఇటీవల జరిగిన మూడు హత్యల నేపథ్యంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ కోడిపందేలకు చెక్ పడింది. మొదటి రోజున పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో రూ.2 కోట్ల వరకూ పందేలు జరిగాయి.
- తుని నియోజకవర్గంలో సుమారు రూ.50 లక్షల మేర కోడిపందేలు, గుండాటలు జరిగాయి.
- జగ్గంపేట మండలంలోని 8 బరుల్లో రోజుకు రూ.80 లక్షల వరకూ కోడి పందేలు జరుగుతున్నాయి. గోకవరం మండలం కృష్ణునిపాలెం, గోకవరం, మల్లవరం, కొత్తపల్లి గ్రామాల్లో కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఒక్కో బరికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ పాటలు జరిగాయి. గోకవరంలో రూ.50 లక్షలు పైనే పలికింది. కిర్లంపూడి, వేలంక, తామరాడ, గ్రామాల్లో పెద్ద బరుల్లో తొలి రోజు రూ.60 లక్షలు, గండేపల్లి మండలంలోని 13 బరుల్లో రూ.30 లక్షల చొప్పున పందేలు జరిగాయి.



మురమళ్లలో స్టేడియాన్ని తలపించేలా భారీ సెట్టింగుల మధ్య కోడిపందేలు

కోనసీమ జిల్లాలో..

- అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, రామచంద్రపురం తదితర నియోజకవర్గాల్లో కోడిపందేలతో పాటు గుండాట బోర్డులు విచ్చలవిడిగా నిర్వహించారు.
- ఐ.పోలవరం మండలం మురమళ్లలో 10 ఎకరాల ప్రైవేటు లే అవుట్‌లో మూడు బరులు ఏర్పాటు చేసి మరీ భారీ హంగామాతో కోడిపందేలు, గుండాటలు జరిపించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద సహా కూటమి నేతల సమక్షంలోనే కోడిపందేలు జరిగాయి. వీటిని వీక్షించేందుకు వీలుగా ఎల్‌ఈడీ స్క్రీన్లు, క్రికెట్ టోర్నమెంట్ మాదిరి గ్యాలరీలు, వీవీపీలకు భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు. ఒక్క మురమళ్ల బరుల్లోనే రూ.25 కోట్లు పైగా కోడిపందేలు జరిగాయని అంటున్నారు. గుండాటలో ఆరితేరిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన నిర్వాహకుడు ఇక్కడి గుండాట బోర్డును వేలంలో రూ.80 లక్షలకు పాడుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. సంక్రాంతి మూడు రోజులూ గుండాట ద్వారా రూ.2 కోట్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టెంట్లు, గ్యాలరీ, ఎల్‌ఈడీల ఏర్పాటులో చేయి తిరిగిన హైదరాబాద్‌కు చెందిన కంపెనీతో రూ.50 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. పండుగ మూడు రోజులు ఇక్కడి బరుల్లో రూ.75 కోట్లు పైనే పందేలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పందేల దరిదాపుల్లోకి పోలీసులు రాకుండా ఉండేందుకు రోజుకు రూ.10 లక్షల వంతున మూడు రోజులకు రూ.30 లక్షలకు ఒప్పందం జరిగిందని విశ్వసనీయంగా తెలిసింది.
- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలో 14 బరులు ఏర్పాటయ్యాయి. ఇక్కడ తొలి రోజు సుమారు రూ.3 కోట్ల మేర పందేలు జరిగాయని అంచనా. కూటమి నేతలు కోడిపందేల కంటే గుండాట బోర్డులు ఎక్కువగా నిర్వహిస్తున్నారు.

కాకినాడ జిల్లాలో..

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో కూటమి నేతలు బరి తెగించి మరీ నిస్సిగ్గుగా పార్టీ పరంగా కోడిపందేలు నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ సంప్రదాయం ముసుగులో దగ్గరుండి మరీ పిఠాపురం పట్టణంలో కోడిపందేలు ఆడించారు. నియోజకవర్గంలోని పిఠాపురం, వాకతిప్ప, పి.దొంతమూరు, గొల్లప్రోలుల్లో టీడీపీ, జనసేన నేతలు పార్టీల పేరుతో వేర్వేరుగా బరులు ఏర్పాటు చేసి, రూ.కోట్లలో పందేలు హోరెత్తించారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే 30 బరులు ఏర్పాటైనట్టు లెక్క తేల్చారు.



పిఠాపురంలో కోడిపందేలు ప్రారంభిస్తున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ



కాకినాడ రూరల్ బోట్‌క్లబ్‌లో కోడి పుంజులతో ఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు

నాలుగెకరాల్లో మామిడి తోట దగ్ధం



మంటలకు మాడిపోయిన మామిడి చెట్లు

తొండంగి: మండలంలోని కొమ్మనాపల్లిలో నాలుగెకరాల్లో మామిడితోట దగ్ధమైంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామ శివారులో కోన గోవిందు, కోన రాంబాబు, కోన వెంకటరావు, కుర్రా పెదకాపు, కుర్రా రాంబాబు, కుర్రా సత్తిబాబు, కుర్రా నాగబాబులు ఎన్నో ఏళ్లుగా నాలుగెకరాల్లో మామిడి తోటలు సాగు చేసుకుంటున్నారు. వీరి తోటలకు సమీపాన పక్క గ్రామానికి చెందిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తరచుగా వైర్లు తగులబెడుతూ, వాటి నుంచి వచ్చిన రాగిని ముద్దగా కరిగించి తీసుకుని వెళ్తున్నారు. ఆదివారం రాత్రి కూడా ఇదే విధంగా వైర్లు తగులబెట్టడంతో ఆ మంటలు క్రమంగా వ్యాపించి తమ తోటల్లోని చెట్లన్నీ మాడిపోయాయని రైతులు వాపోతున్నారు. పూత పూసిన మామిడి చెట్లన్నీ మంటలకు మాడిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పశుగ్రాసం కోసం ఎకరం విస్తీర్ణంలో వేసిన గడ్డి, తాటిచెట్లు, ఇతర చెట్లు పూర్తిగా కాలిపోయాయని వివరించారు. దీనిపై బాధిత రైతులు తొండంగి పోలీసులకు, ఉద్యానవన శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. తోటలకు దుక్కి, పూత కోసం, తెగుళ్ల నివారణకు అవసరమైన పురుగు మందుల కోసం దాదాపుగా రూ.2 లక్షల వరకూ పెట్టుబడి పెట్టామని, చెట్లు కాలిపోవడంతో ఆ మేరకు నష్టపోయామని, జీవనాధారం కోల్పోయామని బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తమ న్యాయం చేయాలని కోరుతున్నారు.

అంబరాన్ని తాకేలా..

- రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు ప్రారంభం
- భోగి మంటతో ప్రారంభించిన తపోవనం స్వామీజీ
- ఆలయ ప్రాంగణంలో ఉట్టిపడిన గ్రామీణ సంస్కృతి



భోగి మంట వెలిగిస్తున్న సచ్చిదానంద స్వామీజీ. చిత్రంలో ఈఓ సుబ్బారావు దంపతులు



కొత్త కుండలపై పాయసం వండుతున్న మహిళలు

అన్నవరం: సత్యదేవుడు కొలువైన రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రత్నగిరి రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలను పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ తుని తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఉదయం ఆరు గంటలకు భోగి మంట వెలిగించి ప్రారంభించారు. అనంతరం తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుతో కలసి తిలకించారు. స్వామివారి వార్షిక కల్యాణ మండపంలో ప్రతిష్ఠించిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల మూర్తులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ తెలుగు సంస్కృతికి సంక్రాంతి ప్రతీక అని అన్నారు. పాడిపంటలు, పశుపోషణతో పెనవేసుకున్న మన సంస్కృతిని, అనుబంధాలను ఏటా గుర్తు చేసే అపురూపమైన పండుగ అని చెప్పారు. అచ్చ తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా దేవస్థానంలో చేసిన ఏర్పాట్లపై సంతోషం వ్యక్తం చేశారు. ఏటా ఇదే విధంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో దేవస్థానం వేద పండితులు గొల్లపల్లి గణపతి ఘనపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, ఉప ప్రధానార్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, పవన్, సుధీర్, శర్మ, పరిచారకులు యడవిల్లి చిన్నా తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఏఈఓ కొండలరావు, పీఆర్ఓ కృష్ణారావు తదితరులు ఏర్పాట్లు చేశారు.

పల్లె వాతావరణం ఉట్టిపడేలా..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా అచ్చ తెలుగు పల్లె వాతావరణాన్ని తలపించేలా రత్నగిరిపై చేసిన ఏర్పాట్లు అందరినీ అలరించాయి. ఒకవైపు పొంగలి వంట, ఇంకోవైపు భోగి మంట, పాడి ఆవులు, తెలుగు పౌరుషానికి ప్రతిరూపంగా నిలిచే కోడి పుంజులు, పొట్టేళ్లు, ఎడ్ల బండి, భోగి పండ్లు, బొమ్మల కొలువు, తాటిచెట్టు, కొబ్బరిచెట్టు వంటి ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. వీటితో పాటు సంప్రదాయ జానపద కళారూపాలైన గంగిరెద్దుల వాళ్లు, కొమ్మదాసరి, హరిదాసు, కళాకారుల కోలాట నృత్యాలతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా దర్శనమిచ్చింది. దీనికి తోడు స్వామివారి వార్షిక కల్యాణ వేదికపై సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి, భక్తులు దర్శించే అవకాశం కల్పించారు. వేడుకల ప్రాంగణంలో కొలను.. దాని వెనుక సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి ఉత్సవమూర్తులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ అలంకరణల వద్ద ఫొటోలు దిగడానికి చాలా మంది భక్తులు పోటీ పడ్డారు. సత్యదేవుని పూజల్లో నిత్యం బిజీగా గడిపే దేవస్థానం ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు సుధీర్, పవన్ తదితరులు కాస్త ఆటవిడుపుగా ట్రాక్టర్ నడుపుతున్నట్టు ఫొటోలు దిగారు.

ప్రభవించేలా..

- నేటి నుంచి ప్రభల తీర్థాలు
- జగ్గన్నతోటలో రేపు ఉత్సవం
- ఇదే రోజు పలుచోట్ల సంబరాలు

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: పచ్చని చేలు.. కొబ్బరి తోటలు.. అందమైన పంట కాలువలు.. లోతైన మురుగునీటి కాలువలు.. వాటి మధ్య నింగిలోని ఇంద్ర ధనస్సులా కదిలాడే ప్రభలు. ఇలా ఒకేసారి అన్నింటినీ చూసేందుకు చాలవు రెండు కళ్లు. విభిన్న రంగులు.. వింతైన రూపురేఖలు.. అందమైన ఆకృతులతో 20 అడుగుల వెడల్పు.. 35 నుంచి 48 అడుగుల ఎత్తు ఉండే ప్రభలు పుర వీధుల మీదుగా గ్రామ పొలిమేరలు దాటే అరుదైన దృశ్యం చూడాలంటే కోనసీమ రావాల్సిందే. ఒకవైపు వరద గోదావరిలా పోటెత్తే భక్తులు.. మరోవైపు ఓంకార నాదాలు.. మేళతాళాలు.. బాణసంచా కాల్పులు.. ప్రభల మెడలో జేగంటల సవ్వడితో నిజమైన ఆధ్యాత్మిక అనుభూతులు పొందాలంటే కోనసీమలో జరిగే ప్రభల తీర్థాలు చూడాల్సిందే.

కోనసీమలో సంక్రాంతి నుంచి ముక్కనుమ తరువాత రోజు వరకూ అన్ని మండలాల్లో ప్రభల తీర్థాలు జరుగుతుంటాయి. చిన్నా పెద్దా అన్నీ కలిపి సుమారు 84 వరకూ ప్రభల తీర్థాలు నిర్వహిస్తారని అంచనా. సంక్రాంతి రోజున జరిగే తొలి ప్రభల తీర్థం కొత్తపేటదే. అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో తీర్థం కనుమ రోజు బుధవారం జరగనుంది. మొసలపల్లి శివారు జగ్గన్నతోట తీర్థానికి ప్రత్యేకత ఉంది. కనుమ రోజున జరిగే తీర్థంలో 11 గ్రామాలకు చెందిన ప్రభలు ఈ తీర్థానికి తరలివస్తాయి. మొసలపల్లి భోగేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నకేశవ మల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనకేశ్వరస్వామి, ఇరుసుమండ ఆనంద రామేశ్వరస్వామి, వక్కలంక కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘువేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వాములు జగ్గన్నతోటలో సమావేశమై లోక కల్యాణార్థం చర్చలు జరుపుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు ప్రభలు జగ్గన్నతోటను ఆనుకుని ఉండే ఎగువ కౌశికను దాటుకుని వచ్చే తీరు నయనానందకరంగా ఉంటుంది. తీర్థానికి చాలా మంది ఇప్పటికీ గూడు బండ్లపై రావడం సంప్రదాయమే. ఈ తీర్థానికి 50 వేల మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా. అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు.



జగ్గన్నతోట ప్రభల తీర్థం (ఫైల్)



గత ఏడాది రిపబ్లిక్ డే పెరేడ్‌లో ఏకాదశ రుద్రులు

కాలువలను దాటుకుని..

వాకలగరువు సోమేశ్వరస్వామి, తొండవరం ఉమా తొండేశ్వరస్వామి, గున్నేపల్లి రామలింగేశ్వరస్వామి ప్రభలు 45 అడుగులు, 43 అడుగుల ఎత్తున నిర్మిస్తారు. మామిడికుదురు శివారు కొర్లగుంటలో జరిగిన ఈ తీర్థానికి సైతం అరుదైన గుర్తింపు ఉంది. ఇక్కడ ప్రభలు పంట కాలువలు, పచ్చని పొలాల మధ్య నుంచి తరలి వస్తుంటాయి. తీర్థానికి మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, ఈదరాడ, పెదపట్నం గ్రామాల నుంచి 17 ప్రభలు వస్తాయి. పెదపట్నం నుంచి 12 ప్రభలు కొర్లగుంట తీర్థానికి రావడం గమనార్హం. వీటితోపాటు అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, అయినవిల్లి, కాట్రేనికోన, ముమ్మిడివరం మండలాల్లో పలుచోట్ల ప్రభల తీర్థాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

భారీగా పోలీసు బందోబస్తు

అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఈ నెల 15న నిర్వహించే ప్రభల తీర్థానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో 360 మంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పి.గన్నవరం సీఐ వై.భీమరాజు తెలిపారు. ఏడుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 32 మంది హెడ్ కానిస్టేబుల్స్, 230 పోలీసులు, 80 మంది హోంగార్డులను నియమించారన్నారు. ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో మొబైల్ పార్టీలు తీర్థంలో పర్యవేక్షిస్తాయన్నారు. ప్రభల నిర్వాహకులు, పోలీసులకు భక్తులు సహకరించాలన్నారు. తీర్థంలోకి ప్రభల వెంట ఎటువంటి సినీ, రాజకీయ ఫ్లెక్సీలు, బూరలను తీసుకు రావద్దన్నారు. అలా తీసుకుని వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు వాహన రాకపోకల మళ్లింపు

కొత్తపేట: సంక్రాంతి ప్రభల ఉత్సవం సందర్భంగా మంగళవారం కొత్తపేట గ్రామం మీదుగా వాహన రాకపోకలు నిషేధించినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ప్రభల ఉత్సవాలు అన్ని ప్రాంతాల్లో కనుమ పండగ (బుధవారం) రోజున జరుగుతుండగా, కొత్తపేటలో మాత్రం మకర సంక్రాంతి రోజున నిర్వహించనున్న విషయం తెలిసిందే. అందువల్ల వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకూ అమలాపురం, రావులపాలెం వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను దారి మళ్లించామని తెలిపారు. రావులపాలెం వైపు నుంచి అమలాపురం వెళ్లే వాహనాలన్నీ బోడిపాలెం వంతెన నుంచి వాడపాలెం, అయినవిల్లి, ముక్తేశ్వరం మీదుగా అమలాపురం వెళ్లాలని, అదే విధంగా అమలాపురం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు పలివెల వంతెన నుంచి పలివెల, గంటి మలుపు, ఈతకోట మీదుగా జాతీయ రహదారికి రావాలని సూచించారు.

జగ్గన్నతోటకు జాతీయ ఖ్యాతి

జగ్గన్నతోట ప్రభల తీర్థం జాతీయ స్థాయిలో గుర్తింపు సంతరించుకుంది. 2024లో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం విశేషం. రాష్ట్ర శకటంగా దీనిని ఎంపిక చేశారు. గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు ఈ తీర్థ విశేషాలను దేశ ప్రధాని నరేంద్ర మోదీకి వివరిస్తూ 2020లో మెయిల్ చేశారు. తీర్థం ప్రాముఖ్యతను మోదీ అభినందించారు. ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లే రాష్ట్ర ప్రభుత్వ శకటం మీద జగ్గన్నతోట తీర్థానికి వచ్చే ఏకాదశ రుద్రులను ప్రదర్శనకు ఉంచాలని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించడంతో జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించినట్టయ్యింది. రిపబ్లిక్ డే పెరేడ్‌లో దర్శనమిచ్చిన ఏకాదశ రుద్రులు దేశాన్ని ఆకర్షించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ వెబ్ సైట్‌లో ఈ తీర్థానికి సంబంధించిన విశేషాలను పొందుపరిచింది.

అట్టహాసంగా ఉత్సవాలు



జగ్గన్నతోటలో కనుమ రోజు నిర్వహించే ప్రభల తీర్థంలో కొలువు తీరే ఏకాదశ రుద్రులను దర్శించుకుంటే సప్త సంతతులు కలుగుతాయి. సప్త సంతతుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త, సంతానం, కీర్తి, గృహం, ఆరోగ్యం, ఆయుష్యులు కలుగుతాయని శివ పురాణాల్లో చెప్పబడింది. ఈ ఉత్సవాలను ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు.

–పుల్లేటికుర్రు సత్యనారాయణ శాస్త్రి, అర్చకుడు, మొసలపల్లి


సమ్మోహనంగా కూచిపూడి నృత్యం


ఆకట్టుకున్న వివిధ వేషధారణలు


సోదెమ్మ, కొమ్మ దాసరి తదితర వేషధారణలు


అబ్బుర పరచిన కేరళ వాయిద్యాలు

నయన మనోహరం..

మామిడికుదురు: సంక్రాంతి 'కళ' ఉట్టిపడింది.. అహో అద్భుతహః అనేలా కట్టిపడేసింది. మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిచేలా అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి క్షేత్రంలో సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి నృత్యం, కొమ్మ దాసరి, బుడ బుక్కల, సోదెమ్మ, గంగిరెద్దుల విన్యాసాలు, విచిత్ర వేషధారణలు, కేరళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ ఈ సంబరాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో భోగి మంట వేసి సందడి చేశారు. 500 మీటర్ల భోగి పిడకల దండ ఊరేగింపులో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం స్వామివారి సన్నిధిలో వివిధ పుష్పాలతో రూపొందించిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	280

వెండి గరగ సమర్పణ

పి.గన్నవరం: స్థానిక బోడపాటివారిపాలెంలోని కొండాలమ్మ ఆలయంలో అమ్మవారికి అదే గ్రామానికి చెందిన ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ అధినేత రంకిరెడ్డి కొండలరావు (కొండబాబు), రిషిత దంపతులు సోమవారం రూ.2.8 లక్షల విలువైన వెండి గరగను సమర్పించారు. వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వాడపల్లిలో భక్తజన సందోహం నడుమ స్వామివారి ఊరేగింపు


వాడపల్లి క్షేత్రంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

చూసిన కనులదే భాగ్యం

- కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం
- భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి

ఆత్రేయపురం: కల్యాణం వైభోగం అన్నట్లు గోదాదేవి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.. చూసిన కనులదే భాగ్యం అన్నట్లు సాగాయి.. కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధికెక్కిన వాడపల్లి శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, కల్యాణం, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ- ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భోగిమంట వేశారు. అనంతరం భక్తజన సందోహం నడుమ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. వాడపల్లి క్షేత్రంలోని విశాలమైన స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారికి డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తదితర ప్రముఖులు కల్యాణ పట్టువస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, కల్యాణాన్ని తిలకించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సతీసమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి క్షేత్రంలో కొలువు దీరిన శ్రీగోదా రంగనాథుల తిరు కల్యాణ మహోత్సవం సోమవారం రమణీయంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, కర్పూర పరిమళ సుగంధ ద్రవ్యాల నడుమ అర్చక స్వాములు గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. 200 మందికి పైగా భక్త దంపతులు కల్యాణంలో కర్తలుగా పాల్గొన్నారు. పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా రూపొందించిన మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువు తీర్చారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ అర్చక స్వాములు రాయభార ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువును జరిపించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. పలువురు ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తన్మయత్వం చెందారు.


అప్పనపల్లిలో గోదా శ్రీరంగనాథుల కల్యాణం చేస్తున్న పండితులు

ఆర్ట్‌ఫుల్‌గా...


పెంకే కృష్ణస్వామి

గండేపల్లి: సంక్రాంతి అంటే డూడూ బసవన్నలు.. హరిదాసుల కోలాహలం చూస్తుంటాం. అలాంటి మన సంప్రదాయాలను తెలిపేలా సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పెంకే కృష్ణస్వామి చిత్రాలు గీసి ఔరా అనిపించారు. గ్రాఫైట్ పెన్సిల్‌ను ఉపయోగించి గంట వ్యవధిలో ఈ చిత్రాలు గీసినట్టు ఆయన తెలిపారు.


బసవన్నల సందడి




పల్లెల్లో సంక్రాంతి శోభను తెలిపేలా గీసిన చిత్రం

ముగిసిన డ్రాగన్ బోట్ పోటీలు

- విజేతలుగా జంగారెడ్డిగూడెం, పల్నాడు టీమ్‌లు
- తృతీయ స్థానంలో ఎన్టీఆర్ ఈగల్


ఆత్రేయపురంలో డ్రాగన్ బోట్ పోటీల్లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు


డ్రాగన్ బోట్ పోటీల ఫైనల్స్‌లో తలపడుతున్న జట్లు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద ప్రధాన పంట కాలువలో కోనసీమ సంక్రాంతి సంబరాల పేరిట సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ- 2025 పడవలు, స్విమ్మింగ్ తదితర పోటీలు సోమవారంతో ముగిశాయి. కేరళ తరహాలో పచ్చని చెట్లు, పంట కాలువలతో మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే గోదావరి పరీవాహక కోనసీమ ప్రాంతంలో మూడు రోజుల పాటు ఆయా పోటీలు విశేషంగా అలరించాయి. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఏపీ పర్యాటక శాఖ పర్యవేక్షణలో గౌతమి- వశిష్ఠ నదుల మధ్య సెంట్రల్ డెల్టా ప్రధాన పంట కాలువలో మూడు రోజులపాటు జరిగిన డ్రాగన్ బోటు, ఈత పోటీలు, అదే ప్రాంతంలో రంగవల్లులు, గాలిపటాల పోటీలు ఉత్కంఠగా సాగాయి.

విజేతలు వీరే..

ఆర్థర్ కాటన్- సంక్రాంతి సంబరాలు, గోదావరి ట్రోఫీ 2025 డ్రాగన్ బోట్ ఫైనల్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆరు టీమ్‌లు పోటీ పడగా, జంగారెడ్డి గూడెం జైంట్స్, పల్నాడు తండర్స్ హోరాహోరీగా తలపడి సమాంతరంగా గమ్యానికి చేరుకున్నాయి. దానితో న్యాయ నిర్ణేతలు ఆ రెండు జట్లకు మొదటి బహుమతి ప్రకటించారు. ఆ మేరకు రూ.లక్ష నగదు చొప్పున, ట్రోఫీ, సర్టిఫికెట్లు, తృతీయ స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ ఈగల్స్ టీమ్‌కు రూ.30 వేల నగదు, ట్రోఫీ, సర్టిఫికెట్ అందజేశారు.

- రంగవల్లుల పోటీల్లో ఎ.అమ్మాజీ (రావులపాలెం) మొదటి బహుమతి రూ.10 వేలు, ఫ్రిజ్, కె.సృజన (ఈతకోట) రెండో బహుమతి రూ.7500, మిక్సీ, టి.ఆదిశ్రీ (రాజమహేంద్రవరం) మూడో బహుమతి రూ.5 వేలు, కుక్కర్ అందించారు. మిగతా వారికి ప్రోత్సాహకాల కింద రూ. వెయ్యి, పతకం, సర్టిఫికెట్ అందజేశారు.
- సీనియర్స్ పతంగుల పోటీల్లో ఎం.సీతారామరాజు (ఊబలంక) ప్రథమ స్థానంలో నిలిచి రూ.4,500, ఆర్.చంటి (ఉచ్చిలి) ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3,500, వి.శాంతరాజు (ఆత్రేయపురం) తృతీయ స్థానంలో నిలిచి రూ.2,500, ఎ.శ్రీనివాసు (అంకంపాలెం) నాలుగో స్థానంలో నిలిచి రూ.2500 బహుమతి గెలుచుకున్నారు.

జూనియర్స్ పతంగుల పోటీల్లో వరుసగా ఎం.ప్రణీత్ వర్మ (హైదరాబాద్), ఎం.దుర్గా సుబ్రహ్మణ్యం (ఆత్రేయపురం), ఎ.పూజితాదేవి(రాజోలు), టి.సన్నీ (కొత్తపేట) బహుమతులు సాధించారు. శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆకుల రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముళ్లపూడి భాస్కరరావు, తహసీల్దార్ టీవీ రాజేశ్వరరావు, ఎంపీడీఓ వెంకటరమణ, ఈవెంట్ ఆర్గనైజర్ దండు శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

- టైటిల్ విన్నర్‌గా దుర్గాప్రసాద్
- విజేతలను ప్రకటించిన జిల్లా అసోసియేషన్


పోటీల్లో టైటిల్ విన్నర్‌గా నిలిచిన దుర్గాప్రసాద్‌కు షీల్డ్, సర్టిఫికెట్ అందిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో ఆదివారం సాయంత్రం మొదలైన యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు అదేరోజు అర్ధరాత్రితో ముగిశాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి హాజరైన దాదాపు 200 మంది బాడీ బిల్డర్లు వివిధ కేటగిరీల్లో పాల్గొని తమ కండలను ప్రదర్శించారు. ఈ మేరకు విజేతల వివరాలను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు సోమవారం ఉదయం వెల్లడించారు. ఈ పోటీలకు సంబంధించి బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్‌గా కాకినాడకు చెందిన ఎం.దుర్గాప్రసాద్, రన్నర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన జి.హేమంతకుమార్, ఫిజిక్స్ స్పోర్ట్స్ టైటిల్ విన్నర్‌గా సీహెచ్ ఇళయరాజా, రన్నర్‌గా పి.బాలరాజు నిలిచారు. 55 కిలోల విభాగంలో ఎస్.రమేష్‌రాజు (అల్లూరి సీతారామరాజు జిల్లా), 60 కిలోల విభాగంలో ఎం.దుర్గాప్రసాద్ (కాకినాడ జిల్లా), 65 కిలోల విభాగంలో ఎస్.దిలీప్ (తూర్పుగోదావరి జిల్లా), 70 కిలోల విభాగంలో పి.బాలరాజు (కాకినాడ జిల్లా), 75 కిలోల విభాగంలో పి.శివగణేష్ (కోనసీమ జిల్లా), ప్లస్ 75 కిలోల విభాగంలో జి.హేమంతకుమార్ (కాకినాడ జిల్లా), దివ్యాంగ విభాగంలో జి.మోషే (కోనసీమ జిల్లా), మాస్టర్స్ విభాగంలో బి.శంకర్ (కాకినాడ జిల్లా), 165 బిలో ఫిజిక్ స్పోర్ట్స్ విభాగంలో పి.బాలరాజు (కాకినాడ జిల్లా), 165 యబో ఫిజిక్స్ స్పోర్ట్స్ విభాగంలో సీహెచ్ ఇళయరాజా (కాకినాడ జిల్లా) వరుసగా ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎం.పోలయ్య, బి.కృష్ణ, బి.ప్రకాష్, దొమ్మేటి వెంకటరమణ, వై.శ్రీనివాసరావు, ఎంవీ సముద్రం వ్యవహరించారు. విజేతలకు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పోటీల ఆర్గనైజర్ ఆశెట్టి ఆదిబాబు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, ముత్తాబత్తుల వెంకటరమణ బహుమతులు అందజేశారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్, అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల విజేతలకు నగదు పురస్కారాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, షీల్డ్‌లు, పతకాలు అందజేశారు.